నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కొవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

హైదరాబాద్, నవంబర్ 27:: కొవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది . ఈ నేపథ్యంలో ఈ నెల 28న వైద్యారోగ్య శాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సమావేశం కానున్నారు. కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. కొత్త వేరియంట్ విజృంభించిన దేశాల నుంచి రాకపోకలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. అంతర్జాతీయ ప్రయాణికులపై ఇప్పటికే రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసిన సంగతి తెలిసిందే.

అంతర్జాతీయ ప్రయాణికుల ట్రేసింగ్, టెస్టింగ్‌పై మంత్రి హరీశ్‌రావు వైద్యారోగ్య శాఖ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేయనున్నారు.

హైదరాబాద్ ఆదివారం 28-11-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 94 పేజీలు:4 వెల: రూ.1/-

విదేశాల నుంచి వచ్చేవారిపట్ల అప్రమత్తంగా ఉండండి.. అధికారులకు ప్రధాని సూచన

న్యూఢిల్లీ, నవంబర్ 27: ఆఫ్రికా దక్షిణ దేశాల్లో బయటపడి ప్రపంచదేశాలను గడగడలాడిస్తున్న కొత్త రకం కరోనా ఒమిక్రాన్ విస్తృతిపైన, దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియపైన ప్రధాని నరేంద్రమోదీ (ఖఓ ఓనీటతి) ఈ ఉదయం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాని కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ న్యూ వేరియంట్‌ను దేశంలోకి రాకుండా కట్టడిచేసే విషయంలో చాలాసేపు చర్చించారు. అదేవిధంగా అధికారులకు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు.

కరోనా కొత్త వేరియంట్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలని అధికారులకు ప్రధాని మోదీ సూచించారు. అన్ని రాష్ట్రాల్లోనూ జిల్లా స్థాయిలో కరోనా న్యూ వేరియంట్‌పై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా కరోనా కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు నిబంధనలు పాటించేలా తీవ్రమైన నిరోధం, నిరంతర నిఘాను కొనసాగించాలని ప్రధాని ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు నిబంధనల మేరకు పరీక్షలు చేయించుకున్నారా లేదా అనే విషయంలో గట్టి పర్యవేక్షణ అవసరమని చెప్పారు. కరోనా ఉధృతంగా ఉన్న దేశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

కొత్త వేరియంట్ కలకలం రేపుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలను సులభతరం చేయడానికి సంబంధించి రూపొందించిన ప్రణాళికలపై అధికారులు పునరాలోచన చేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు.

ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సంఘం సమావేశం నిర్వహించాం'

హైదరాబాద్, నవంబర్ 27:ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సంఘం సమావేశం నిర్వహించామని రాష్ట్ర అధ్యక్షులు మందాడి వెంకట్రావు అన్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని రేషన్ డీలర్ల సంఘాల సమావేశంలో చర్చించామని చెప్పారు. డిసెంబర్ 10వ తేదీన జాతీయ స్థాయిలో డీలర్ల సమావేశం నిర్వహిస్తామమని తెలిపారు. గన్నిలపై వచ్చే ఆదాయాన్ని కూడా ప్రభుత్వం గండి కొడుతోందని, వాటి ఆదాయాన్ని డీలర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొబైల్ రేషన్ విధానంపై తమ వృత్తి భద్రతకుపై చర్చించలేదన్నారు. చట్టాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. దేశంలో ఆహార భద్రతా చట్టం ప్రకారం ఏ విధంగా కొనసాగిస్తున్నారో రాష్ట్రంలో కూడా అదే విధంగా కొనసాగించాలన్నారు.

కర్రలతో దాడులు చేసుకున్న కుటుంబాలు..

నిజామాబాద్, నవంబర్ 27:: మాక్లూరు మండలం చిక్లి గ్రామంలో రెండు కుటుంబాలు పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నాయి. వరి కోత మిషన్ విషయంలో శేఖర్, హనీష్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ గొడవ కాస్త ముదరడంతో.. ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు చిక్లి గ్రామానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఇరు కుటుంబాలను పోలీసులు కంట్రోల్ చేశారు.

అభివృద్ధి పథంలో పంచాయతీలు: వినోద్ కుమార్

సిద్దిపేట, నవంబర్ 27:: రాష్ట్రం సిద్ధించాక తెలంగాణలోని మునిసిపల్, పంచాయతీలు నేడు అభివృద్ధి పథంలో ముందుకు కొనసాగుతున్నాయని రాష్ట్ర రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. పట్టణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమైక్యాంధ్రలో మునిసిపాలిటీలు, పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ కేంద్రాలన్నింటిని మున్సిపాలిటీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ధాన్యాన్ని కేంద్రం వెంటనే కొనుగోలు చేయాలన్నారు.

పంజాబ్‌లో పట్టు బిగిస్తున్న ఆప్

న్యూఢిల్లీ, నవంబర్ 27:చండీగఢ్&ఢల్లీలో చక్రం తిప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆదమీ పార్టీ చాలారోజులుగా పంజాబ్ పై కన్నేసింది. అయితే గత ఎన్నికల్లో ప్రభావం చూపినప్పటికీ చెప్పుకోదగ్గ ఫలితం సాధించలేదు. కానీ ఇప్పుడు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టేలా కేజ్రీవాల్ అడుగులు వేస్తున్నారు. ఇప్పటినుంచే అందుకు వ్యూహం అమలు చేస్తున్నారు. పంజబాలో నెలకొన్ని రాజకీయ అనిస్థితి తమకు అనుకూలిస్తుందని కేజ్రీవాల్ గట్టిగా నమ్ముతున్నారు. రాజకీయ వ్యూహకర్త పి.కె. సలహాలు దీనికి తోడయ్యాయి. గత శాసనసభ ఎన్నికల్లో 117 స్థానాల అసెంబ్లీలో 20 స్థానాలు నెగ్గింది. 2014లో 4 ఎంపీ స్థానాలు గెలుచుకున్న ఆప్ 2019లో మాత్రంకేవలం ఒక స్థానానికే పరిమితమైంది. అంతమాత్రాన ఆ పార్టీ నిరాశ చెందలేదు. ప్రజాదరణ లేదని చెప్పలేని పరిస్థితి. శాసనసభ స్థానాలు రాకపోయినప్పటికీ గణనీయంగానే ఓట్లు వచ్చాయి.

అందువల్లే వచ్చే శాసనసభ ఎన్నికలపై దృష్టి పెట్టి పనిచేస్తోంది. సాగుచట్టాల నేపథ్యంలో ఎన్డీయే నుంచి అకాలీదళ్ వేరుపడింది. కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన అమరీందర్ బయటకు వెళ్లిపోయారు. నవజ్యోత్ సింగ్ సిద్దూ పీసీసీ సారథిగా బాధ్యతలు చేపట్టినా కొత్త ముఖ్యమంత్రి చన్నీతో పొసగడం లేదు. తరచూ కీచులాటలతో అటు ప్రజలు, ఇటు కాంగ్రెస్ అధిష్ఠానం విసిగిపోయాయి. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన అమరీందర్ సింగ్ కొత్త పార్టీ పెట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రస్తుతం సాగు చట్టాలు రద్దు చేసినప్పటికీ రైతులనుంచి బీజేపీకి ఎంతవరకు మద్దతు లభిస్తుందో చెప్పలేం. ఈ పరిస్థితులను అనుకూలంగా మార్చుకునేందుకు కేజ్రీవాల్ క్షేత్రస్థాయిలో వ్యూహాలు అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ లో పరిస్థితులను చూసి వచ్చే ఎన్నికల్లో దెబ్బతింటామన్న గుబులు ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో నెలకొంది.

కాంగ్రెస్ నుంచి 35మంది వరకు ఎమ్మెల్యేలు ఆప్ లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని కేజ్రీవాల్ స్వయంగా ప్రకటించారు. అయితే వారంతా సరైన నాయకులు కారని, అలాంటి చెత్తమాకొద్దని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా కొన్ని కీలకాంశాలు పరిశీలించొచ్చు. అమృత్ సర్ కాంగ్రెస్ కంచుకోట. ఇక్కడ ఎమ్మెల్యే ఓమ్ ప్రకాశ్ సోని ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. అలాగే 40 ఏళ్లుగా కాంగ్రెస్ లోనే పనిచేస్తున్న సుఖ్ దేవ్ సింగ్ కూడా కాంగ్రెస్ లో ఇమడలేకపోతున్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ లో ఉన్నానని, గెలుపు ఓటములు చూశానని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ భవితవ్యంపై ఆశలు లేవని సుఖ్ దేవ్ సింగ్ అంటున్నారు. ఆప్ అవకాశం ఇస్తే పోటీ చేస్తానని సన్నిహితులతో చెబుతున్నారు.

పేదలకు ఆ పార్టీ మేలు చేస్తుందని భావిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ కార్యకర్త జ్యోతి ఖన్నా కూడా ఆప్ పై ఆశలు పెట్టుకున్నారు. మాదకద్రవ్యాల సమస్యను కాంగ్రెస్ పరిష్కరించలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంజాబ్ లో ఎప్పుడూ కాంగ్రెస్, అకాలీదళ్ మధ్య పోటీ ఉంటుందని, కానీ ఈసారి ఆప్ గట్టిపోటీ ఇవ్వబోతోందని యువత అభిప్రాయపడుతోంది. కానీ మోగా వంటి ప్రాంతాల్లో మహిళా ఓటర్లు మాత్రం ఆప్ పై పెద్ద ఆసక్తి చూపడం లేదు. అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు వెయ్యి రూపాయల పెన్షన్ ఇస్తానన్న హామీ వారిని ఆకర్షించడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న చన్నీ సారథ్యంలో ప్రభుత్వం బాగా పనిచేస్తోందని వారు అంటున్నారు.

అయితే కేజ్రీవాల్ ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. ప్రముఖ నటుడు, సామాజికవేత్త సోనూసూద్ ఇక్కడి వాడే. ఆయన ఇటీవల కేజ్రీవాల్ ను కలిశారు. అలాగే, ఇదే ప్రాంతానికి చెందిన ఖళీ ఆప్ లో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ 20 శాతం తగ్గిపోయిందని మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ఇటీవల చెప్పారు. ఆయన సారథ్యంలో జులై-సెప్టెంబర్ నెలల మధ్య నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం తేలిందని చెప్పుకొచ్చారు. ఈసారి పంజాబ్ లో విభిన్న రాజకీయ పరిస్థితులు ఉంటాయని, వచ్చే ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్, అకాలీదళ్ పార్టీలతో పాటు ఆయా పార్టీల అసంతృప్తుల కూటమితోపాటు మరో ఫ్రంట్ కూడా బరిలో ఉంటుందని అంచనావేస్తున్నారు. ఆప్ కు పరిస్థితులు సానుకూలంగానే ఉన్నప్పటికీ ప్రజల అభిప్రాయాన్ని ఎంతమేరకు ఓట్లుగా మలుచుకుంటుందనే దానిపై ఆ పార్టీ విజయం ఆధారపడి ఉంటుందని అమరీందర్ సింగ్ అంటున్నారు.

చరితలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



తం॥ మొదటమున-తుజమేకు త్రమ
పాదమ్ము దమర్చి బుగుల పరవశయిదునక
వేదాత్ముండగు భవతుజ-త్ర
మొదకరదాపేక్షిరుశ్మమునుగ అ గిరిచెన్!!

(నవంబర్ 28 శృతిమ పాదమును అందించిన శాస్త్రవేత్త ప్రమోద్ కరణ్‌సేఠీ పుట్టిన రోజు..)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

న్యాక్‌లో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటుకు త్రిసభ్య కమిటీ

హైదరాబాద్, నవంబర్ 27:హైటెక్ సిటీలోని న్యాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో ఇప్పటికే త్రిసభ్య కమిటీ వేశామని, ఆ నివేదిక రాగానే వర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

శనివారం నిర్వహించిన న్యాక్ 42వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాక్‌లో పలు బ్లాక్‌లను మంత్రి స్వయంగా పరిశీలించారు. న్యాక్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల అనుభవాలను ప్రశాంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థులకు న్యాక్ కల్పిస్తున్న ఉద్యోగ నియామకాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు న్యాక్ అనే నంన్న స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. కొవిడ్ సమయంలోనూ న్యాక్ పని చేసిందని గుర్తు చేశారు. గతేడాది 19 వేల మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. ఈ సంవత్సరం 20 వేల మందికి శిక్షణ ఇవ్వాలని అనుకుంటున్నాం అని తెలిపారు. బీటెక్ చదివిన వారికి న్యాక్ ఆధ్వర్యంలో ఒక ఏడాది పీజీ విద్యను అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇక ఇక్కడ పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు స్లాబ్ పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు పీఆర్సీ అంశానికి సంబంధించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాను అని మంత్రి పేర్కొన్నారు.

కరోనా నుంచి కోలుకున్న పోచారం.. మరికొన్ని రోజులు హోం క్వారంటైన్ లో..

న్యూఢిల్లీ, నవంబర్ 27:రీసెంట్ గా కరోనా బారిన పడ్డారు తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈ నెల 24 నుండి ఆయన హాస్పటల్ లో చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల పోచారం శ్రీనివాస్ రెడ్డి మనవరాలి పెళ్లి హైదరాబాద్ లో జరిగింది. ఈ వివాహానికి ఏపీ సీఎం జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా హాజరయ్యారు. ఈ పెళ్లి తర్వాతే పోచారంకు కరోనా పాజిటివ్ వచ్చింది. కాగా ప్రస్తుతం ఆయన కరోనా నుంచి కోలుకున్నారు. తాజాగా నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షలో పోచారంకు నెగెటివ్ వచ్చింది. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకపోవడంతో ఆయనను వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. వైద్యుల సలహా మేరకు మరికొన్ని రోజుల పాటు హోం క్వారంటైన్ లో ఉండనున్నారు.

జ్వరంతో బాధపడుతోన్న లాలూ ప్రసాద్.. ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిక

న్యూఢిల్లీ, నవంబర్ 27:ఢిల్లీ ఎయిమ్స్ హాస్పటల్ లో చేరారు ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్..తీవ్ర జ్వరంతో బాధపడుతోన్న ఆయన్ని ఎయిమ్స్ లో జాయిన్ చేశారు. కాగా మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన ఆయన రీసెంట్ గా బీహార్ కి వెళ్ళారు. దాణా కుంభకోణం కేసులో లాలూ ప్రసాద్ యాదవ్ కి జార్ఖండ్ కోర్టు బెయిల్ మంజూరీ చేసింది. గత రెండేళ్ల నుంచి రాంచీలోని రాజేంద్ర మెడికల్ ఇన్స్టిట్యూట్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు.

కల్వకుంట్ల కవితని కలిసిన గంగవ్వ టీం..

కొండగట్టు అంజన్నని దర్శించుకున్నారు కల్వకుంట్ల కవిత. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. కాగా ఎమ్మెల్సీ కవితను మై విలేజ్ షో సెలబ్రిటీ గంగవ్వ కలిసింది. కవితని తాను మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపింది? ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితను..గంగవ్వ టీం సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ? అధికార టీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని? టిఆర్ఎస్ పార్టీ ముందు ఇంకా అనేక టార్గెట్స్ ఉన్నాయని తెలిపారు.

ప్రజల మధ్య ఉంటూనే.. సమస్యలు పరిష్కరిస్తున్నాం : మంత్రి తలసాని

హైదరాబాద్, నవంబర్ 27:నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఈరోజు సనత్ నగర్ లో రూ.1.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా సుందర్ నగర్ కాలనీ పార్క్ లో రూ.13.20 లక్షలతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ప్లే పార్క్, ఓపెన్ జిమ్ లు, సుభాష్ నగర్ లో రూ.46.90 లక్షల వ్యయంతో (జి ప్లస్ 1) నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్, సనత్ నగర్ బస్ స్టాప్ వద్ద రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ (జి ప్లస్ 1), జిమ్ లను స్థానిక కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ? గతంలో ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించిన నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చేవారని, తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న విషయాన్ని గుర్తుచేశారు. 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి కేవలం 7 సంవత్సరాలలో జరిగిందని వివరించారు. రోడ్లు, డ్రైనేజి, మంచినీటి పైప్ లైన్, సీవరేజ్ పైప్ లైన్ ల ఏర్పాటు, పార్క్ ల అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి పనులను కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజల అవసరాల కోసమే కమ్యూనిటీ హాల్స్ ను నిర్మించడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీకి చెందిన ప్రజలు చిన్న చిన్న వేడుకలు, సమావేశాల కోసం కమ్యూనిటీ హాల్స్ ను ఉపయోగించుకోవాలన్నారు. సనత్ నగర్ బస్టాప్ వద్ద ప్రారంభించిన జిమ్ లో ఇంకా కొన్ని పరికరాలు కావాలని స్థానికులు కోరగా, 10 రోజుల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ వంశీ, డీఈ మోహన్, ఈఈ ఇందిర, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ భార్గవ్, నాయకులు కొలన్ బాల్ రెడ్డి, సురేష్ గౌడ్, సరాఫ్ సంతోష్, కరుణాకర్ రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

స్విట్జర్లాండ్‌లో అంగరంగ వైభవంగా దీపావళి వేడుకలు

హైదరాబాద్, నవంబర్ 27: తెలుగు అసోసియేషన్ స్విట్జర్లాండ్ వారి ఆధ్వర్యంలో జ్యురీచ్‌లో దీపావళి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.

నవంబర్ 21న నిర్వహించిన ఈ వేడుకల్లో తెలుగు ప్రజలందరూ పాల్గొని ఎంజాయ్ చేశారు. తెలుగు అసోసియేషన్ స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ కడలి గనికాంబ, జనరల్ సెక్రటరీ కిశోర్ తాటికొండ, ఇతర తెలుగు అసోసియేషన్ సభ్యుల సహకారంతో దీపావళి వేడుకలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో వేడుకలు కనువిందుగా కొనసాగాయి. స్విట్జర్లాండ్‌లో స్థిరపడిన 150 మంది తెలుగువారు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. దీపావళి వేడుకల నేపథ్యంలో చిన్నారులు ఉత్సాహంగా బాణాసంచా కాల్చి ఎంజాయ్ చేశారు.

ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ

శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి
ప్రముఖ కవి
ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన
మనసు తొడుక్కున్న మనిషి
(దీర్ఘకావ్యం) గ్రంథావిష్కరణ

తేది: 02-12-2021 గురువారం
సాయంత్రం 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి

ముఖ్యఅతిథి ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : ఆచార్య తంగెడ కిషన్ రావు, ప్రముఖ కవి
ఉపకులపతి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

గౌరవ అతిథులు : శ్రీ కళా జనార్దనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

ఆచార్య మసన చెన్నప్ప
తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

శ్రీ దాస్యం సేనాధిపతి
ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

శ్రీ బైస దేవదాసు
నేటి నిజం దినపత్రిక సంపాదకులు

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
కళాశారద కార్యదర్శి, త్యాగరాయగానసభ

విశ్వవిద్యాలయాలు నిరుద్యోగాన్ని పెంచడానికేనా?!

భారతదేశంలో 45,000 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉన్నత విద్యను దేశ యువతకు అందిస్తున్నాయి. మన దేశ విద్యార్థుల ఆర్థిక సామాజిక నేపథ్యం పరిశీలించినపుడు 50 శాతం యువత గ్రామీణ ప్రాంతాల వారు ఉండడంతో పాటు 50 శాతం యువత తొలి తరం కళాశాల విద్యలను అభ్యసిస్తున్నట్లు తేలింది. ఉన్నత విద్యాభ్యాసం చేసే యువతలో 70 శాతం కుటుంబాల వార్షిక ఆదాయం 5 లక్షల లోపు ఉండడం, 25 శాతం వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు ఉండడం గమనించారు. ఓబిసి, ఈబిసి రిజర్వేషన్ల కారణంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన యువత ఉచిత విశ్వవిద్యాలయ చదువులకు చేరువ అవుతున్నారు. దేశ ఉన్నత విద్య స్థూల నమోదు నిష్పత్తి (జిఈఆర్) 27 వరకు చేరడం చూస్తున్నాం.

అన్ని అవరోధాలను అధిగమించి ఉన్నత విద్యను పూర్తి చేసిన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందలేక పోవడం విచారకరం. పిజీ, పిహెచ్‌డీలు పూర్తి చేసిన యువతకు కూడా అర్హతకు తగిన ఉద్యోగాలు కొరవడి యువశక్తి నిర్వీర్యం అవుతున్నది. మన నేటి ఉన్నత విద్యా ప్రమాణాలు అట్టడుగున అంతర్జాతీయ ప్రమాణాలకు ఆమడ దూరంలో ఉండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు దొరక్క సతమతం అవుతున్నారు. ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఉద్యోగాలను కల్పిస్తూ, విద్యావంతులను నిర్లక్ష్యం చేస్తూ చేతులు దులుపుకోవడంతో యువత నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఉన్నత డిగ్రీలు చేతబట్టి చిన్న కాల్ సెంటర్, జూమెటో ఫాస్ట్ ఫుడ్/అమెజాన్ వస్తు పంపిణి, వ్యవసాయం, శ్రామిక వర్గ పనులు చేయలేక త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతూ, ప్రమాదకర దుస్థితులకు లోనవుతున్నారు.

ఉన్నత విద్య పూర్తి చేసిన యువత సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ, అదే సంఖ్యలో ఉద్యోగాలు పెరగకపోవడంతో యువత దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు కూడా వెనుకాడడం లేదు. ప్రైవేట్ ఉద్యోగాల్లో కూడా ఈ-వాణిజ్య (అమెజాన్, జూమెటో, ఫ్లిప్‌కార్ట్ వంటి) సేవారంగంలో డెలివరీ బాయ్స్‌గా యువత ఉద్యోగ/ఉపాధి అవకాశాలు పెరుగుటతో విద్యావంతులు నిస్సహాయంగా నిచ్చేష్టులై చూస్తూ నిలబడి పోతున్నారు.

విశ్వవిద్యాలయ పట్టాలు చేతబట్టిన యువతకు సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్క సమాజంలో అశాంతికి కూడా కారణం కావడం చూస్తున్నాం. విశ్వవిద్యాలయ చదువులతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించే కోర్సులు, సంస్థలు పెరగాల్సిన అగత్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా విస్తరించిన 15,000 ఐటిఐ సంస్థల ద్వారా ఏసి, ఎలక్ట్రీషియన్, మెకానికల్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ లాంటి అంశాల్లో వృత్తి శిక్షణలు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని ప్రభుత్వాలు గమనించాలి. ప్రస్తుత ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ మరియు ఐటిఐలను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సంస్థలుగా రూపొందించాలి. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నదని తెలుసుకోవాలి. విద్య మనో వికాసాన్ని కల్గించుటతో పాటు అర్హతకు తగిన జీవనోపాధిని కూడా కల్పించాలి. ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలికి, యువశక్తిని జాతి సమగ్రాభివృద్ధికి దోహదపడేలా చూడాల్సిన భాధ్యత ప్రభుత్వాలకు, ప్రైవేట్ రంగాలకు ఉన్నదని గుర్తుంచుకోవాలి. డిగ్రీల కోసమే కాకుండా ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యావంతులుగా ఎదిగేందుకు యువత సిద్ధం కావాలి. అర్హత, విషయపరిజ్ఞానం, నైపుణ్యాలు కలిగిన యువతకు ఉద్యోగ ఉపాధులకు కొరత లేదనే మంచి రోజులు రావాలని భరతమాతను వేడుకుందాం. యువశక్తితో నవ భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రభాగాన అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుపుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

తెలంగాణలో టాటా.. హార్డ్‌వేర్‌లో అడుగు పెట్టాలనే ప్లాన్..

హైదరాబాద్, నవంబర్ 27: దేశీయ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్ సెమికండక్టర్ల వ్యాపారంలోకి అడుగు పెట్టబోతోంది. సెమికండక్టర్ల అమరిక, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 300 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2,250 కోట్లు) పెట్టుబడులు పెట్టాలని దేశీయ దిగ్గజం టాటా గ్రూప్ యోచిస్తోంది. ఇందుకోసం మూడు దక్షిణాది రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలతో టాటా గ్రూపు చర్చలు జరుపుతోంది. ఓఎస్ఏటీ(ఔట్‌సోర్స్‌డ్ సెమికండక్టర్ అసెంబ్లి అండ్ టెస్ట్) ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కోసం టాటా గ్రూప్ అన్వేషిస్తోందని ఈ అంశంపై అవగాహన ఉన్న వర్గాలు వెల్లడించాయి. సెమికండక్టర్ వ్యాపారానికి సంబంధించి మొదటి వార్త ఇదేకావడం గమనార్హం. కాగా ఓఎస్ఏటీ ప్లాంట్ ప్యాకేజింగ్, అమరికతోపాటు ఫౌండ్రీలో తయారైన సిలికాన్ వాఫెర్స్‌ను పరీక్షిస్తుంది. సెమికండర్ చిప్‌లు సిద్ధం చేస్తుంది.

అయితే ఫ్యాక్టరీ కోసం సమర్థవంతమైన ప్రాంతాన్ని ఎంచుకోవాలని టాటా గ్రూప్ భావిస్తోందని ఓ ప్రతినిధి పేర్కొన్నారు. ఫ్యాక్టరీని ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది వచ్చే నెలలో ఖరారయ్యే అవకాశం ఉందని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో టాటా గ్రూపు ఇప్పటికే చాలా దృఢంగా ఉంది. హార్డ్‌వేర్ రంగాన్ని కూడా తమ పోర్ట్‌ఫోలియో చేర్చుకోవాలని ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. హార్డ్‌వేర్ రంగంలో దీర్ఘకాల వృద్ధి క్లిష్టమని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ రిపోర్టులపై ఇటు టాటా గ్రూప్ కానీ.. అటు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు కానీ ఇప్పటివరకు స్పందించలేదు. టాటాల ఓఎస్ఏటీ బిజినెస్‌లో ప్రభావవంత క్లయింట్ల కంపెనీల జాబితాలో ఇంటెల్, అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్(ఏఎండీ), ఎస్‌టీమైక్రోఎలక్ట్రానిక్స్ ఉన్నాయి

రోడ్ స్వీపింగ్ మేషీన్స్‌తో.. మనీ స్వీపింగ్..

హైదరాబాద్, నవంబర్ 27: రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జీహెచ్ఎంసీ) తీసుకొచ్చిన వ్యాక్యూమ్ స్వీపింగ్ మిషన్ వాహనాలు దుమ్ముకు బదులుగా డబ్బుల్ని మింగేస్తు న్నాయి. జీహెచ్ఎంసీ పౌర సంస్థ నగరంలోని ఐదు జోన్లలో 26 స్వీపింగ్ మిషన్ వాహనాల ద్వారా రోడ్లను శుభ్రం చేస్తుంది. కానీ.. వాహనాల కాంట్రాక్టు తీసుకున్న ప్రైవేటు ఏజెన్సీలు మాత్రం పనులు చేయకుండాలనే బిల్లులను దండుకుంటున్నాయనే విమర్శలు తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి.

గ్రేటర్ పరిధిలో మొత్తం రెండు వేలకు పైగా ఉన్న రహదారులను శుభ్రపరిచేందుకు 26 స్వీపింగ్ మిషన్ వాహనాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలు కాంట్రాక్టుల ద్వారా నిర్వహిస్తున్నాయి. కానీ.. ఈ వాహనాలు రహదారికి మధ్యలో డివైడర్‌ను ఆనుకొని ఉన్న మొదటి లేన్‌ను మాత్రమే శుభ్రం చేసి మిగిలిన రోడ్డంతా గాలికి వదిలేస్తున్నాయి. దాంతో రోడ్లపై దుమ్ము అదేవిధంగా ఉంటోంది. వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చి, ఆ ప్రాంతంలో కేవలం సింగిల్ లేన్‌ను మాత్రమే శుభ్రపరిచి, రోడ్డంతా శుభ్రపరిచినట్లు చూపిస్తున్నాయి. అంటే, నాలుగు లేన్లు ఉన్న రోడ్డుపై ఒక కిలోమీటరు శుభ్రంచేస్తే దాన్ని నాలుగు కి.మీలుగా లెక్కల్లో చూపిస్తున్నాయి. స్వీపింగ్ మిషన్ల నిర్వహణను పర్యవేక్షిస్తున్న పౌర సరఫరాల అధికారులు ఈ విశయాలు తెలిసి కూడా మౌనం వహిస్తున్నారని అభియోగాలు వ్యక్తమవుతున్నాయి.

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఐదు జోన్లలో స్వీపింగ్ కోసం ప్రస్తుతం ఉన్న వాహనాలకు తోడుగా మరో 18 కాంపాక్ట్ హెవీ డ్యూటీ వ్యాక్యూమ్ స్వీపర్లను వినియాగించాలని బల్దియా నిర్ణయించింది. ప్రధాన రహదారులపై దుమ్మును తొలగించడంతో పాటు గాలి నాణ్యతను మెరుగు పరిచేందుకు ఏటా రూ.32 కోట్లతో ఈ హెవీ డ్యూటీ వ్యాక్యూమ్ స్వీపర్లను తీసుకురావాలని జీహెచ్ఎంసీ పౌర సంఘం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న స్వీపింగ్ యంత్రాలను తనిఖీ చేసిన అధికారులు వాటి పని తీరును పరిశీలించారు.

ఇందులో భాగంగా, స్వీపింగ్ వాహన యంత్రాల చీపుర్ల నాణ్యతను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్)లు 18 స్వీపింగ్ మిషన్లు నాసిరకంగా ఉన్నట్లు తేల్చారు. కండీషన్‌లో లేని వాహనాల వాడకంపై ప్రైవేటు కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ మరో 18 స్వైపింగ్ మిషన్లను (ఫ్యాకేజీ) తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా.. మొదటి సంత్సరం పాటు సింగిల్ ఇంజన్ (స్వీయ ఛోదక యంత్రాలు)తో సక్షన్ పరిజ్ఞానం కలిగిన స్వీపర్ యంత్రాలను తీసుకొవాలనుకుంటుంది. ఏడాది కాలంలో నగరం లోని ఐదు జోన్లలో వాటి పనితనం, సామర్థ్యాల ఆధారంగా మరో రెండేళ్లకు కొనసాగించేందుకు అవకాశం ఉంది. మొత్తం 18 ప్యాకేజీల్లో ఖైరతాబాద్‌లో 5, ఎల్‌బి నగర్‌లో 4, సికింద్రబాద్‌లో 4, శేర్లింగంపల్లిలో 3, కూకట్లపల్లిలో 2గా విభజించనున్నారు. ఒక్కో ప్యాకేజీ కాంట్రాక్టు విలువ రూ.1,14,46,400 ఉండనుంది. ఈ మొత్తం ప్యాకేజీకి జీహెచ్ఎంసీకి ఏడాదికి రూ.32 కోట్లకు పైగా ఖర్చు అవనుంది. కాగా, ఇకనైనా అధికారులు కఠినంగా వ్యవహరించి నిధులు దుర్వినియోగం కాకుండా ప్రైవేట్ ఏజెన్సీలను నియంత్రించాలనే వాదనలు వ్యక్తం అవుతున్నాయి.

ఆ దేశాలకు విమానాలను నిలిపేయండి.. ప్రధాని మోదీకి ఢిల్లీ సీఎం అభ్యర్థన

న్యూఢిల్లీ: ఆఫ్రికా ఖండంలోని దక్షిణాది దేశాల్లో కొత్త రకం కరోనా మహమ్మారి ఒమిక్రాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ (ంతీజీలతినిట ఐపతీతిలిజీశ్రీ) ఆందోళన వ్యక్తంచేశారు. భారత్ నుంచి ఆయా దేశాలకు విమానాల రాకపోకలను నిలిపివేయాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. కరోనా కొత్త వేరియంట్ ప్రభావిత దేశాలకు విమానాల రాకపోకలను నిలిపివేయాలని నేను గౌరవ ప్రధానమంత్రిని కోరుతున్నా. మనం ఎన్నో కష్టాలు పడి కరోనా బారి నుంచి కోలుకున్నాం. కాబట్టి ఈ కొత్త వేరియంట్ దేశంలో ప్రవేశించకుండా అడ్డుకోవడానికి మనం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలి అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

వైట్ గూడ్స్ పరిశ్రమకు డిపిఐఐటి ద్వారా పిఎమ్ పి పరిగణన- డిపిఐఐటి-ఫిక్కీ ఇన్వెస్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో డిపిఐఐటి సెక్రటరీ శ్రీ అనురాగ్ జైన్

న్యూఢిల్లీ, నవంబర్ 27:వైట్ గూడ్స్ పిఎల్ఐ పై ఉన్నత స్థాయి డిపిఐఐటి-ఫిక్కీ ఇన్వెస్టర్ రౌండ్ టేబుల్ సమావేశం లో డిపిఐఐటి కార్యదర్శి శ్రీ అనురాగ్ జైన్ మాట్లాడుతూ, ఎ సి పరిశ్రమ దిగుమతులను నియంత్రించడానికి, స్థానికంగా విలువ ,ఉపాధిని పెంచడానికి దశలవారీ తయారీ (పిఎంపి) ప్రణాళిక పరిశీలనకు ప్రభుత్వం సుముఖంగా ఉందని తెలిపారు. ఎసి పరిశ్రమ కోసం పిఎంపితో ముందుకు రావాలని రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన కొంతమంది సిఇఒలు చేసిన సూచనలకు ఆయన స్పందించారు.

వైట్ గూడ్స్ పిఎల్ఐ కింద వచ్చే పెట్టుబడులన్నీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుండి వేగంగా అనుమతులు పొందేలా డిపిఐఐటి చూస్తుందని, తద్వారా పిఎల్ఐ కింద నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించవచ్చునని శ్రీజైన్ పేర్కొన్నారు.

సులభ వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) కోసం ఉద్దేశించిన నేషనల్ సింగిల్ విండో అనుమతుల వ్యవస్థ ను వేగవంతం చేసే ప్రక్రియలో ఉన్నామని, ఇక్కడ అన్ని అప్లికేషన్ లను ఆన్ లైన్ లో దాఖలు చేసి ట్రాక్ చేయవచ్చని శ్రీజైన్ తెలిపారు. ప్రెస్ నోట్ 3 కింద ప్రభుత్వం ఎఫ్ డిఐ దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తోందని కూడా ఆయన చెప్పారు.

భారతదేశం నాయకత్వం వహించగల రంగాలకు ప్రయోజనం చేకూర్చడానికి , అలాగే కొత్తగా వస్తున్న రంగాలకు ప్రయోజనం చేకూర్చడానికి ,వాటిని ప్రపంచ పోటీకి సిద్ధం చేయడానికి పిఎల్ఐ పథకాన్ని రూపొందించినట్లు శ్రీ జైన్ తెలిపారు.

డిపిఐఐటి అదనపు కార్యదర్శి శ్రీ అనిల్ అగ్రవాల్ మాట్లాడుతూ, ఎఫ్ ఐ సి సి ఐ ఎలక్ట్రానిక్స్ అండ్ వైట్ గూడ్స్ కమిటీ కృషిని ప్రశంసించారు. వైట్ గూడ్స్ కోసం పిఎల్ ఐ కి పరిశ్రమ స్పందన విశేషంగా ఉందని అన్నారు. ఈ పథకాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకుందని, అందువల్ల ఈ పథకం అమలుకు ఎలాంటి అడ్డంకులు రాలేదని ఆయన అన్నారు.

వైట్ గూడ్స్ కోసం పిఎల్ఐ ప్రస్థానాన్ని శ్రీ అగ్రవాల్ వివరిస్తూ, దాదాపు ఒక సంవత్సరంలో, విలువ గొలుసు (వాల్యూ చైన్) అంతటా పరిశ్రమ ఫీడ్ బ్యాక్ ,ఏకాభిప్రాయం ఆధారంగా ఈ పథకాన్ని రూపొందించి అమలు చేసేలా డిపిఐఐటి నిర్ధారించిందని చెప్పారు.

డిపిఐఐటి-ఫిక్కీ ఇన్వెస్టర్ రౌండ్ టేబుల్ లో వైట్ గూడ్స్ పరిశ్రమకు చెందిన నూట యాభై మంది సిఇఒలు/సిఎక్స్ వోలు పిఎల్ఐలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. కాంపోనెంట్ వాల్యూ ఛైయిన్ లో ని ఈ పెట్టుబడిదారుల్లో చాలా మందివి చిన్న , మధ్యతరహా కొత్త వెంచర్లే. వారు ఇప్పుడు ఓఈఎమ్ లకు సరఫరా చేస్తారని, గ్లోబల్ వాల్యూ ఛైయిన్ లతో ఇంటిగ్రేట్ అవుతార ని శ్రీఅనిల్ అగ్రవాల్ పేర్కొన్నాడు.

దేశం రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్న వేళ గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ, నవంబర్ 27:షెడ్యూలు తెగల వారు జాతీయ ప్రధాన స్రవంతిలో చేరడానికి వీలుగా వివిధ రంగాలలో షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలను , హక్కులను పరిరక్షించడానికి వారిని ప్రోత్సహించడానికి రాజ్యాంగంలో అనేక నిబంధనలు పొందుపరచబడ్డాయి. దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 75 వసంతాలను గుర్తుగా ఆజాది కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో గిరిజన సంక్షేమం, గిరిజనులకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనల అమలుపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 కింద రాజ్యం సమాజంలోని బలహీన వర్గాల ప్రత్యేకించి షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల ప్రజల విద్య, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించవలసి ఉంది. అలాగే వారికి అన్యాయం జరగకుండా వారు ఏ రకమైన దోపిడీకి గురికాకుండా వారిని రక్షించవలసి ఉంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4) కింద విద్యా సంస్థలలో రిజర్వేషన్ కల్పించడం జరిగింది. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4),16(4ఎ) , 16 (4 బి) కింద పోస్టులు, సర్వీసులలో రిజర్వేషన్ కల్పించడం జరిగింది.

మానవ అక్రమ రవాణాను , భిక్షాటనను , ఇతర రూపాలలోని బలవంతపు చాకిరీని ఆర్టికల్ 23 నిషేదం విధిస్తున్నది. షెడ్యూలు తెగల విషయంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం 1976ను పార్లమెంటు తీసుకువచ్చింది. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏదైనా ఫ్యాక్టరీ, గనులలో, లేదా ప్రమాదకర కార్యకలాపాలలో పనికి కుదుర్చుకోవడాన్ని ఆర్టికల్ 24 నిషేధిస్తున్నది. షెడ్యూలు తెగల వారి విషయంలో ఇది కూడా ఎంతో కీలకమైనది.

అటవీప్రాంతంలోని వారి హక్కుల రక్షణకు 2016లో షెడ్యూలు తెగలు, ఇతర సంప్రదాయంగా అటవీ ప్రాంత నివాసితుల(అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 (ఎఫ్.ఆర్.ఎ)ని తీసుకు రావడం జరిగింది. ఎఫ్.ఆర్.ఎ చట్టాన్ని గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలు చేస్తుంది. ఇది తరతరాలుగా అటవీ ప్రాంతంలో నివశిస్తున్న తెగల హక్కులను పరిరక్షిస్తుంది. ఇది అటవీ హక్కులను రికార్డు చేసేందుకు ఒక ఫ్రేమ్ వర్క్ ను కల్పిస్తుంది. అలాగే ఇలాంటి గుర్తింపు పొందేందుకు అవసరమైన సాక్ష్యాలను రికార్డు చేసేందుకు ఫ్రేమ్ వర్క్ కలిగి ఉంటుంది. ఈ చట్టం 1-1-1008 నాటి నోటిఫికేషన్ లో పొందుపరచిన నిబంధనలకు అనుగుణంగా అమలులోకివచ్చింది. 2014 మే నుంచి 2021 ఆగస్టు వరకు 5,03,709 క్లెయిమ్‌లు (వ్యక్తిగతం 4,36,644, కమ్యూనిటీ 67,065 క్లెయిమ్‌లు) స్వీకరించడం జరిగింది. 5.65,515 టైటిల్స్ (వ్యక్తిగతం 5,11,681 టైటిల్స్,కమ్యూనిటీ పరంగా 53,834 టైటిల్స్ పంపిణీ చేయడం జరిగింది.

ఈ చట్టం అమలులో క్షేత్రస్థాయలో మరింత మెరుగైన సమన్వయం ఉండేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖతో కలిసి కార్యాచరణకు సంబంధించి ఉమ్మడి అంశాలను గుర్తించనుంది. ఇలాంటి సమన్వయానికి గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, అటవీ , పర్యావరణ మంత్రిత్వశాఖ 2021 జూలై 6న సంయుక్తంగా ఒక లేఖను రాష్ట్రప్రభుత్వాలకు పంపాయి. అటవీ హక్కుల గుర్తింపు, వాటిని కల్పించడానికి సంబంధించి చట్టం సత్వర అమలుకు అటవీ విభాగం ఉన్నత స్థాయి మద్దతు నివ్వవలసి ఉంటుందని పేర్కొంది.

పంచాయత్ (షెడ్యూలు ఏరియాలవి స్తరణ)చట్టం, 1996 (పిఇఎస్ఎ)ను కేంద్ర ప్రభుత్వం షెడ్యూలు ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలకు స్వయం పాలనకు గ్రామ సభల ద్వారా స్వయం పాలనకు వీలు కల్పించేందుకు దీనిని తీసుకువచ్చింది. దీనిని భారతప్రభుత్వానికి చెందిన పంచాయతి రాజ్ మంత్రిత్వశాఖ అమలు చేస్తోంది. ఇది గిరిజన కమ్యూనిటీల హక్కులను చట్టబద్ధంగా గుర్తిస్తుంది. షెడ్యూలు ఏరియాలోని ప్రజలు తమ పాలనను తామే నిర్వహించుకునేందుకు , వారి సంప్రదాయ హక్కులకు రక్షణ కల్పించేందుకు సహజవనరులపై వారి సంప్రదాయ హక్కులను కాపాడేందుకు ఉపకరిస్తుంది. ఈ లక్ష్యానికి అనుగుణంగా పిఇఎస్ ఎ గ్రామసభకు అధికారాలను కల్పిస్తున్నది.

ఈ చట్టం లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల ఆమోదం, అమలులో గ్రామసభ కు పిఇఎస్? అధికారాలను కల్పిస్తున్నది.

పంచాయితీలు (షెడ్యూల్డ్ ఏరియా విస్తరణ)చట్టం 1996 లోని ప్రొవిజన్లపై ఒక రోజు జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. 75 వసంతాల ఆజాది కా అమృత్ మహోత్సవ్ , పెసా చట్టం తీసుకువచ్చి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా పంచాయతి రాజ్ మంత్రిత్వశాఖ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్, పంచాయతిరాజ్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సును నవంబర్ 18న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సును గ్రామీణాభివృద్ధి, పంచాయతి రాజ్ శృఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ప్రారంభించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ అర్జున్ మొండా, పంచాయతి రా? శాఖ సహాయమంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్, మహారాష్ట్ర గవర్నర్ శ్రీ భగత్‌సింగ్ కోషియారి ఈ సదస్సులోని వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం ఆరు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలు పెసా నిబంధనలను నోటిఫై చేశాయి. ఈ సదస్సులో నాలుగు రాష్ట్రాలు, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలను పెసాను అమలు చేయాల్సిందిగా కోరడం జరిగింది. పంచాయతిరాజ్ , గిరిజన వ్యవహారాల శాఖ కేంద్ర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. చట్టం అమలులో ఎదురౌతున్న ఇబ్బందులను , వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలను ఈ సందర్భంగా చర్చించారు.

జమ్ము కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం: షెడ్యూలు తెగలు, ఇతర సంప్రదాయ అవాసం కలిగిన వారి (హక్కుల రక్షణ) చట్టాన్ని 2020 డిసెంబర్ లో జమ్ముకాశ్మీర్‌లో అమలుకు నోటిఫై చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీనిని 2021 సెప్టెంబర్ 13న జమ్ములో లెఫ్టినెంట్ జనరల్ శ్రీ మనోజ్ సిన్హా శ్రీనగర్‌లో , 2021 సెప్టెంబర్ 18న జమ్ములో ప్రారంభించారు. 2600 మందికిపైగా వ్యక్తులకు సంబంధించి అలాగే కమ్యూనిటీ హక్కులకు సంబంధించి అధికారులు వారికి హక్కులు కల్పించారు. దీనివల్ల 7000 మంది గిరిజన కుటుంబాలకు ప్రయోజనం జరిగింది. కేంద్ర పాలిత ప్రాంతం లోని గిరిజన సంక్షేమ విభాగవంద్ద 20 వేల దరఖాస్తులు వివిధ దశలలో తమ హక్కుల కోసం పెండింగ్ లో ఉన్నాయి.

పంచాయతి రాజ్ సంస్థలకు చెందిన ఎస్టి ప్రతినిధులకు శిక్షణ:

గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ రాష్ట్ర టిఆర్ ఐ సమన్వయంతో ఈ చట్టాల అమలుకు బాధ్యులైన రాష్ట్రప్రభుత్వ అధికారులకు, పంచాయతిరాజ్ సంస్థల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నది. రాజ్యాంగ పరంగా వారికి గల హక్కులను తెలియజేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మంత్రిత్వశాఖకు చెందిన వెబ్ సైట్ (బితీతిఎజీజీశ్రీ.నితిఇ.తిని), మంత్రిత్వశాఖకు చెందిన పనితీరుకు సంబంధించిన దాష్ బోర్డు గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలుఉ సంక్షేమ కార్యక్రమాలను, రాజ్యాంగపరంగా వారి హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నాయి. స్వాతంత్రం సాధించిన 75 సంవత్సరాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఆజాదికా అమృత్ మహోత్సవ్ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను మంత్రిత్వశాఖకు చెందిన ఆది- ప్రసారణ్ (adiprasara.tribal.gov.in) పోర్టల్‌లో చూడవచ్చు.

పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లిస్తాం ..మంత్రి కన్నబాబు ..

అమరావతి, నవంబర్ 27:వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అసెంబ్లీ సమావేశాలు పుర్తయిన అనంతరం ఉభయగోదావరి జిల్లాల్లో మంత్రి పర్యటించారు. సీఎం జగన్ రైతులని ప్రతి కష్టంలో ఆదుకుంటున్నారని తెలిపారు. తాడేపల్లిగూడెం , తణుకు , ఆచంట నియోజకవర్గాల్లో సహచర మంత్రి రంగనాథ రాజు ఇతర శాసన సభ్యులతో సహా పొలాల్లోకి వెళ్లి దెబ్బతిన్న పంటలను మంత్రి పరిశీలించారు. పంట నష్టం అంచనాలు పారదర్శకంగా చేసి త్వరలోనే నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలంలో బి కొండెపాడు గ్రామంలో పొలాల్లోకి దిగి మంత్రి కన్నబాబు పంటనష్టాన్ని అంచనా వేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి చెరుకువాడ రంగనాథ రాజు, తణుకు శాసనసభ్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించి అకాల వర్షాలు వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. రైతులకు ఎక్కడా నష్టం జరగకుండా చూస్తామని మంత్రులు ధైర్యం చెప్పారు. ఆచంట నియోజకవర్గంలోని నత్తా, రామేశ్వరం, పెనుమంట్ర, బ్రాహ్మణ చెరువు తదితర గ్రామాల్లో మంత్రులు , ఎమ్మెల్యేలు పర్యటించనున్నారు.

చలాన్లతో వేధిస్తున్నారని.. నడిరోడ్డుపైనే బైక్‌కు నిప్పు..

ఆదిలాబాద్, నవంబర్ 27:రూల్స్ అండ్ రెగ్యూలెషన్స్ కచ్చితంగా అమలు చేయడంలో పోలీసులను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. కానీ, కావాలని చిన్న చిన్న విషయాలకు ఫొటోలు తీసి చలాన్లు వేస్తుంటే.. చాలామంది వాహనదారులు విసిగిపోతున్న మాట వాస్తవం. అయితే.. పోలీసులా.. వసూళ్లకు ఏజెంట్లా అన్

కొండగట్టు అంజన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, నవంబర్ 27:కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈరోజు ఎమ్మెల్సీ కవిత కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ నుండి కొండగట్టు చేరుకున్న కవిత అక్కడి నుండి కాలినడకన కొండపైకి చేరుకున్నారు. ముందుగా భేతాళ స్వామి, సుబ్రమణ్యస్వామికి పూజలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికైన కవిత ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండగట్టులో నిర్మిస్తున్న రామకోటి స్తూపం పనులను పరిశీలించారు.

ఆలయం మొత్తం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ?. కొండగట్టు దేవాలయానికి వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం అన్ని వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. ఏ కొండెక్కినా, ఏ బండకు మొక్కినా అది రాష్ట్రం కోసమేనని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వీలైనన్ని ఎక్కువ నిధులు మంజూరు చేస్తోందన్న ఎమ్మెల్సీ కవిత కొండగట్టు ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రాసే రామకోటీలను స్వామి వారికి సమర్పించేందుకు వీలుగా రామకోటి స్థూపాన్నినిర్మిస్తున్నామని, నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. ప్రజలందరికి కరోనా కష్టాలు తొలగిపోవాలని గత ఏడాది చిన్న హనుమాన్ జయంతి నుండి పెద్ద హనుమాన్ జయంతి వరకు 81 రోజులు పరిపూర్ణంగా అఖండ హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు పెద్ద ఎత్తున యాగం నిర్వహించామని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా రెండోసారి ఏకగ్రీవంగా గెలిపించిన కామారెడ్డి, నిజామాబాద్ ప్రజాప్రతినిధులకు, అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఎమ్మెల్సీ కవిత ధన్యవాదాలు తెలిపారు. రామకోటి స్థూప నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం, ఎమ్మెల్సీ కవిత భక్తులు, ఆలయ సిబ్బందిని పలకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీకి మరో 3 పీజీ సీట్లు

మహబూబ్‌నగర్, నవంబర్ 27:: మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో మరో మూడు పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. పాథాలజీలో మూడు పీజీ మెడికల్ సీట్లను నేషనల్ మెడికల్ కమిషన్ మంజూరు చేసింది. దీనివల్ల మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింత అవకాశం ఏర్పడనుందని కాలేజీ డైరెక్టర్ పుట్టా శ్రీనివాస్ అన్నారు. ఈ పెంపుతో ఏడు మెడికల్ స్పెషాలిటీల్లో పీజీ సీట్ల సంఖ్య 20కి పెరిగాయని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహకారం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు.

కేజీబీవీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్, నవంబర్ 27: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ), కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు శుభవార్త చెప్పింది. ఆయా ఉద్యోగుల వేతనాలను 30శాతం పెంచింది. ఈ మేరకు శనివారం విద్యాశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో -117ను జారీచేశారు. పెరిగిన వేతనాలను జూన్ 1, 2021 నుంచి వర్తింపజేయనున్నారు. జూలైలో అందజేసే వేతనంలో కలిపి ఇవ్వనున్నారు. సమగ్రశిక్ష అభియాన్‌తోపాటు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 5వేల పైచిలుకు ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరి వేతనాలను పెంచుతామని, పీఆర్సీని వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ గతంలో అసెంబ్లీలో ప్రకటించారు.

ఈ మేరకు 2020 పీఆర్సీ ప్రకారం వీరికి వేతనాలను పెంచాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీరి వేతనాలు పెంచేందుకు గాను సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆయా ప్రతిపాదనలను పరిశీలించిన సర్కారు 30శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. సమగ్ర శిక్ష అభియాన్‌లో పాఠశాల, క్లస్టర్, మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌తోపాటు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలను సైతం పెంచుతున్నట్లు జీవోలో పేర్కొన్నారు. వేతనాల పెంపు పట్ల పలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

ఆన్‌లైన్ గంజాయి స్మగ్లింగ్ కేసులో.. ఏడుగురి అరెస్టు

అమరావతి, నవంబర్ 27: ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి విక్రయదారులు రోజుకో అడ్డదారిని తొక్కుతున్నారు. ఎలాగైనా అతి తక్కువ సమయంలో కోట్లకుపడగలెత్తాలనే ఉద్దేశంతో రోడ్డు, ఇతర మార్గాల్లో గంజాయిని సరఫరా చేస్తున్న విక్రయదారులు ప్రస్తుతం రూట్‌ను మార్చారు. వినియోగదారులకు నిషేదిత జాబితాలో లేని అన్ని రకాల వస్తువులను ఈ కామర్స్ సంస్థలు నేరుగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే నిషేదిత గంజాయి లాంటి మత్తు పదార్థాలను కూడా సరఫరా చేస్తే ఎవరికి అనుమానం రాదనే అనుమానంతో కొందరు అమెజాన్ సంస్థను ఎంపిక చేసుకొని గంజాయిని సరఫరా చేస్తున్నారు.

పసిగట్టిన విశాఖ పోలీసులు నిఘా ఉంచి విశాఖకు చెందిన ఐదుగురిని, మధ్యప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ సతీశ్‌కుమార్ వెల్లడించారు. ఈ కామర్స్ వెబ్? సైట్ అమెజాన్? ద్వారా హెర్బల్ ఉత్పత్తులు, కరివేపాకు పేరిట విశాఖ నుంచి మధ్యప్రదేశ్?తోపాటు ఇతర ప్రాంతాలకు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు . వీరి వద్ద నుంచి 48 కిలోల గంజాయి, ఒక మోపెడ్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్, గంజాయి ప్యాకింగ్ మెటీరియల్, అమెజాన్ టేపులు, బ్యాగ్స్ స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ కేసులో ఇద్దరు అమెజాన్ డెలివరీ బాయ్స్ పాత్ర ఉందని వెల్లడించారు. కేసు దర్యాప్తు ముమ్మరం చేసి, నిందితులు జీరు కృష్ణమూర్తి, బిజ్జం కృష్ణంరాజు, చిలకపాటి మోహన్ రాజును చీపురుపల్లి వెంకటేశ్వరరావు, చిలకపాటి శ్రీనివాసరావు అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ జేడీ వెల్లడించారు. మధ్యప్రదేశ్? గ్వాలియర్ కు చెందిన సూరజ్, ముకుల్ జైస్వాల్‌లను అరెస్ట్ చేసినట్లు జేడీ పేర్కొన్నారు.

వన్ ధన్ యోజనతో నాగాలాండ్ గిరిజనులకు సాధికారత!

గిరిజనుల్లో ఔత్సాహిక వాణిజ్య, పారిశ్రామిక తత్వాన్ని ప్రోత్సహించడంలో నాగాలాండ్ రాష్ట్రం,.. దేశానికే ఆదర్శంగా నిలిచింది. సమూహ (క్లస్టర్) అభివృద్ధి, ఉత్పాదనలకు విలువల జోడింపు తదితర అంశాలు సమూహ సభ్యులకు ఎలా సహాయపడతాయో, వారు మరింత ఆదాయం సంపాదించేందుకు ఎలా దోహదపడతాయో వివరించడంలో యావద్దేశానికి నాగాలాండ్ ఒక ఉదాహరణగా నిలిచింది. ప్రధానమంత్రి వన్ ధన్ యోజన (పి.ఎం.వి.డి.వై.) పథకం కింద అభివృద్ధి చేసిన పలు సమూహాలతో ఈ క్లస్టర్లను రూపొందించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య (ట్రైఫెడ్),..వివిధ రాష్ట్రాల ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ క్లస్టర్లను ప్రవేశపెట్టింది. పెట్టుబడి సహాయం అందించడం, శిక్షణ ఇవ్వడం, వారిని కార్యోన్ముఖం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా గిరిజనులకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పి.ఎం.వి.డి.వై. పథకాన్ని రూపొందించారు. గిరిజనులు తమ వాణిజ్యాన్ని విస్తరింపజేసుకోవడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ పథకం తీసుకువచ్చారు.

నాగాలాండ్.లోని నోక్లక్ జిల్లానుంచి, చపి.ఎం.వన్ ధన్ యోజన విజయగాథ... తేనె, తేనెగూళ్ల మైనం ఉత్పత్తిలో గిరిజనులు సాధించిన విజయమిది. నాగాలాండ్.లో వన్ ధన్ యోజన పథకాన్ని అమలు చేయడంలో నాగాలాండ్ తేనెటీగల పెంపకం, తేనె పథకం (ఎన్.బి.హెచ్.ఎం.) ఎంతో దోహదపడింది.

నాగాలాండ్.లోని వోఖా జిల్లాకు చెందిన చుకితాంగ్ నుంచి చపి.ఎం. వన్ ధన్ జయోజన విజయగాథ. వోఖా జిల్లాలోని వన్ ధన్ క్లస్టర్ అడవి తేనె, ఉసిరి, మాచికాయ, అల్లం, పసుపు, కొండచీపుర్లు, ఓస్టెర్ పుట్టగొడుగులు వంటి ఉత్పత్తులను ఈ వన్ ధన్ క్లస్టర్ ఉత్పత్తి చేస్తోంది. చిన్న తరహా అటవీ ఉత్పత్తులుగా వీటిని తయారు చేస్తున్నారు. క్లస్టర్.లోని 5,700మంది సభ్యులు దీనితో ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. చంఎతీతిబిఓజీష్ణనీబిబజీలష్ణబిబిజూబ://బి.ఇనీ/ఎలీజూ01జఏతీతీలి

నాగాలాండ్ రాష్ట్రంలో తేనె ఉత్పత్తికి ఎన్.బి.హెచ్.ఎం. సంస్థ, ఒక నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పైన ఉదహరించిన క్లస్టర్లకు సంబంధించి పథకం అమలు ప్రక్రియను పర్యవేక్షించే ఏజెన్సీగా ఎన్.బి.హెచ్.ఎం. పనిచేస్తోంది. తొలిదశలో కేవలం తేనెటీగల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలకు మాత్రమే వన్ ధన్ యోజన కార్యక్రమాన్ని అమలు చేసింది. తొలుత నాలుగు జిల్లాల్లో, 5 వన్ ధన్ వికాస్ కేంద్రాల సమూహాల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. తేనె ఉత్పత్తి అనేది కేవలం ఒక సీజన్లో జరిగే వ్యాపకం కావడంతో సీజన్ కానపుడు వన్ ధన్ స్వయం సహాయక గ్రూపుల సభ్యులు ఏమీ పనిలేకుండా గడిపేవారు.

ఈ నేపథ్యంలో వన్ ధన్ వికాస్ కేంద్రాల సమూహాలను సంవత్సరమంతా తీరికలేకుండా పనుల్లో నిమగ్నం చేసేందుకు ఇతర చిన్న తరహా అటవీ ఉత్పత్తుల ఉత్పాదనకోసం ఒక కార్యక్రమాన్ని ఎన్.బి.హెచ్.ఎం. రూపొందించింది. కొండచీపుర్లు, అల్లం, ఓస్టెర్ పుట్టగొడుగులు, మాచికాయలు వంటివాటి ఉత్పత్తిలో సభ్యులను నిమగ్నం చేసింది. నిజానికి,.. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి సమయంలో కొన్ని స్వయం సహాయక గ్రూపులతో ప్రయోగాత్మకంగా ఓస్టెర్ పుట్టగొడుగుల సాగు మొదలైంది. ఫలితాలను బట్టి, ఈ సాగును విస్తృత స్థాయిలో చేపట్టాలని ఎన్.బి.హెచ్.ఎం. నిర్ణయించుకుంది. ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి జరగడం, మార్కెటింగ్ సదుపాయాలకు అవకాశాలు ఏర్పడటంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వన్ ధన్ వికాస్ కేంద్రాల సమూహాలు ఇపుడు చాలా విస్తృత స్థాయి ఓస్టెర్ పుట్టగొడుగులను సాగు చేస్తున్నాయి. రానున్న కొన్ని నెలల్లోనే గులాబి, తెలుపు రంగుల రకాల ఓస్టెర్ పుట్టగొడుగులు దాదాపు 5 మెట్రిక్ టన్నుల వరకూ ఉత్పత్తి కావచ్చని అంచనా.

ట్రైఫెడ్ చేస్తున్న కృషి, కనీస మద్దతు ధర పథకం ద్వారా చిన్న తరహా అటవీ ఉత్పత్తులకోసం రూపొందించిన మార్కెటింగ్ యంత్రాంగం, చిన్న తరహా అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు వ్యవస్థ.. ఇవన్నీ గిరిజన జీవన పరిస్థితుల్లో గణనీయమైన మార్పును తీసుకువచ్చాయి. దీనితో అటవీ ఉత్పత్తుల సేకరణ రూ. 30కోట్లనుంచి 1,843కోట్లకు పెరిగింది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులను, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నిధులను వినియోగించుకోవడంతో ఇది సాధ్యమైంది. ఇదే పథకంలో భాగంగా వన్ ధన్ ట్రైబల్ స్టార్టప్ కంపెనీలు కూడా ఆవిర్భవించాయి. గిరిజన సమూహాలకు, అటవీ వాసులకు, ఇళ్లలో గడిపే గిరిజన పనివారికి,. ఉపాధి వనరులుగా ఇవి రూపుదిద్దుకున్నాయి.

కేవలం ఒక్క నాగాలాండ్ రాష్ట్రంలోనే, 285 వన్ ధన్ స్వయం సహాయక బృందాలు, 19 వన్ దన్ వికాస కేంద్రాల సమూహాలు (వి.డి.వికె.లు)గా రూపుదాల్చాయి. వాటిలో 9 వి.డి.వి.కె.లను (అంటే 135 వన్ ధన్ స్వయం సహాయక బృందాలను) ఉత్పత్తి కార్యకలాపాలకోసం కార్యోన్ముఖం చేశారు. నాగాలాండ్ రాష్ట్రంలోని జున్.హెబోటో, వోఖా, త్యూన్సాంగ్, ఫెక్, మోకోక్చుంగ్ జిల్లాల పరిధిలో ఇవి తమ సేవలందించాయి. అడవి తేనె, ఉసిరి ఉత్పత్తులు, మాచికాయలు, జాంతోజైలమ్, ఎర్ర గోంగూర, అల్లం, పసుపు, కొండ చీపుర్లు, ఓస్టెర్ పుట్టగొడుగులు వంటి ఉత్పత్తులను వన్ ధన్ వికాస్ కేంద్రాల సమూహాలు ఇపుడు ఉత్పత్తి చేస్తున్నాయి. చిన్న తరహా అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు ప్రక్రియ ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యకలాపాలతో 5,700మంది గిరిజన సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఇప్పటివరకూ, రూ. 35.32 లక్షల వరకూ అమ్మకాలు జరిగాయి. తద్వారా నాగాలాండ్.లోని గిరిజన కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి, సాధికారతకు వన్ ధన్ వికాస కేంద్రాల సమూహాలు ఎంతగానో కృషిచేస్తున్నాయి.

ఇక వన్ ధన్ గిరిజన స్టార్టప్ కంపెనీలు కూడా గిరిజనుల ఉపాధి కల్పనకు తగిన మార్గాలుగా ఆవిర్భవించాయి. తొలి వన్ ధన్ కేంద్రాన్ని 2018 ఏప్రిల్ 14వ తేదీన చత్తీస్ గఢ్.లోని బిజాపూర్.లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. గిరిజనుల ఉత్పత్తులకు విలువల జోడింపు కేంద్రంగా దీనికి రూపకల్పన చేశారు. ఆ తర్వాత కేవలం రెండేళ్లలోగానే, 37,362 వన్ ధన్ స్వయం సహాయక బృందాలు, 2,240 వన్ ధన్ వికాస్ కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఒక్కొక్క వన్ ధన్ వికాస కేంద్రానికి 300మంది చొప్పున అటవీ నివాసులను ట్రైఫెడ్ కేటాయించింది. వన్ ధన్ యోజన పథకం ప్రారంభమైననాటినుంచి, గిరిజన సాధికారతకోసం ట్రైఫెడ్ ఎంతో కృషి చేసింది. దాదాపు 50,000 వన్ ధన్ స్వయం సహాయక బృందాల ఏర్పాటుకోసం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఒక ఉద్యమం తరహాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ట్రైఫెడ్, గత అక్టోబరు 15వ తేదీన ఒక మైలురాయిని అధిగమించింది. ఆ రోజున, ఏకంగా 50,000 వన్ ధన్ స్వయం సహాయక బృందాలను మంజూరు చేసింది. ప్రస్తుతం వీటి సంఖ్య 52,976కు చేరుకుంది. అవన్నీ 3,110 వన్ ధన్ వికాస కేంద్రాల సమూహాలుగా రూపొంతరం చెందాయి.

గిరిజన జీవన పరిస్థితులను మెరుగు పరిచే ఒక వెలుగు రేఖగా, మార్పునకు నిదర్శనంగా ఈ పథకం ఇప్పటికే తగిన ఫలితాలను అందించింది. గిరిజనుల ఉపాధి కల్పనకు ప్రధాన వనరుగా నిలిచింది. విలువల జోడింపు ద్వారా జరిగే అటవీ ఉత్పత్తుల అమ్మకాలతో ఆదాయం నేరుగా గిరిజనులకు చేరే ఏర్పాటు ఉండటమే ఈ పథకం గొప్పతనం.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ జవహర్లాల్ నెహ్రూ నౌకాశ్రయం - నవ సేవ సందర్శన .. భారతీయ కస్టమ్స్ కార్యకలాపాల సమీక్ష

న్యూఢిల్లీ, నవంబర్ 27:ముంబై తీరప్రాంతమైన మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలోని నవ శేవా కేంద్ర లో ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్. ఈరోజు కస్టమ్స్ కార్యకలాపాలపై ఒక రోజు చేపట్టిన సుదీర్ఘ సమీక్ష.

సులభతరం చేసే కస్టమ్స్ పరిష్కార ప్రక్రియ అమలును ఆర్థిక మంత్రి నమీక్షించారు. ఇటీవలి కాలంలో,పరోక్షపన్నుల కస్టమ్స్ బోర్డు తన పరిధిలోని దిగుమతులపై పత్రాలను ఆన్‌లైన్‌లో ముందస్తుగా దాఖలు చేయడం, ఇ-సంచిత్ పై అనుబంధ పత్రాల సమర్పణ, ఆన్‌లైన్ కస్టమ్స్ డ్యూటీ చెల్లింపుతో పాటు వస్తువుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, కస్టమ్స్ డిజిటలైజేషన్, అనుమతి పత్రాల దిగుమతులపై ఆటోమేటెడ్ క్లియరెన్స్ వంటి ముఖ్యమైన అంశాలు తప్పనిసరి చేసింది. .

ఈ సంస్కరణలను పూర్తి చేయడానికి, బోర్డు లాజిస్టిక్స్ చైన్‌లో ఎక్స్-రే స్కానర్‌లు, కంటైనర్‌ల ట్రాకింగ్ ట్రేసింగ్ కోసం రేడియో ఫ్రీక్వెన్సీ ట్యాగ్‌లను ఉపయోగించడం వంటి మెరుగైన చర్యలు చురుకుగా అమలుపరచింది . కస్టమ్స్ మండలి చేపట్టిన ఎలెక్ట్రానిక్ సంస్కరణలు/కార్యక్రమాలు సరళ వ్యాపార వైఖరికి, సమస్యలను తగ్గించడంతో పాటు మొత్తం సరుకు విడుదల సమయాన్ని తగ్గించడానికి గణనీయంగా దోహదపడతాయి.

ఆర్థిక మంత్రి, సులభతర వాణిజ్య నిర్వహణకై కస్టమ్స్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను సమీక్షించిన తర్వాత, ఏరోజుకారోజు కార్య పాలకై నిర్దేశించిన 'జీరో డైలీ అసెస్‌మెంట్ పెండెన్సీ' సాధించడానికి విధుల సమన్వయంతో సరుకులను (కార్గో) వేగంగా విడుదల చేయాలని కోరారు. ఆమె ఖీనీఆఇఖ (ఎగుమతి ఉత్పత్తులపై సుంకాలు,పన్నుల తగ్గింపు) , ఖీనీూఆఒ (రాష్ట్ర ఉ కేంద్ర పన్నులు మరియు లెవీ తగ్గింపు రేట్లు), తిరిగి చెల్లింపులు /డ్రాబ్యాక్‌లను సకాలంలో పూర్తి చేయడం . వంటి ఎగుమతి ప్రోత్సాహక పథకాలు, ప్రక్రియ లపై దృష్టి సారించారు :

అపాయకర వస్తువుల ఏరివేత మరింత వేగంగా చేయాలని నిర్మలా సీతారామన్ అధికారులను కోరారు. న్యాయ ప్రక్రియ ఏదైనా తప్పనిసరి అయితే , దిగుమతి చేసుకున్న మూడు నెలల్లో పూర్తయ్యే విధంగా నిర్వహించాలని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు తగిన ప్రచారం కల్పించాలని ఆమె అన్నారు. నవ సేవ నౌకాశ్రయంలో మంత్రి ఓడ, కార్గో నిల్వ నంచయాన్ని మరియు రవాణా కార్యకలాపాలలో మౌలిక సదుపాయాల సర్వేను కూడా ఆమె చేపట్టారు. కస్టమ్స్ అధికారులు నిర్వహించిన రెవెన్యూ, భద్రత, వాటి సరళీకరణ విధానాన్ని ఆమె తనిఖీ చేశారు

నవ సేవా నౌకాశ్రయంలో లో దాదాపు 50% ఎగుమతి ఇజలను (ఇరవై అడుగుల సమానమైన పెట్టెల పరిమాణం) అందించే కర్మాగారాన్ని ఇ-సీల్డ్ కంటైనర్‌ల కోసం పోర్ట్‌కు సమీపంలో సెంట్రలైజ్డ్ పార్కింగ్ ప్లాజాలో "సింగిల్ యూనిఫైడ్ ఆన్-వీల్ ఎక్స్‌పోర్ట్ డాక్యుమెంటేషన్ సెంటర్" ను మంత్రి సందర్శించారు . ఒక సంవత్సరం క్రితం ప్రారంభించబడిన సెంట్రలైజ్డ్ పార్కింగ్ ప్లాజా, నౌకాశ్రయానికి వెలుపల అనేక ప్రదేశాలు డాక్యుమెంట్ ప్రాసెసింగ్ ఇతర సేవలను ఏకీకృతం చేస్తుంది.

వాణిజ్యాన్ని మరింత సులభతరం చేయడానికి, మంత్రివర్యులు సీతారామన్ సెంట్రలైజ్డ్ పార్కింగ్ ప్లాజాలోనే ఆన్-వీల్ ఫ్యాక్టరీ సీల్డ్ ఎగుమతి కంటైనర్‌ల కోసం ఏర్పాటు చేసిన కస్టమ్స్ ఎగ్జామినేషన్ ఫెసిలిటీని ప్రారంభించారు. ప్రమాద సందర్భాలలో కంటైనర్‌లను ప్రత్యేక ప్రదేశానికి పంపాల్సిన అవసరాన్ని ఈ సౌకర్యం తొలగిస్తుంది. ఎగుమతిదారులకు ఖర్చు, సమయం రెండూ ఆదా అవుతాయి. ఈ సదుపాయానికి భూమి పూజను ఆర్థిక మంత్రి ఈరోజు నిర్వహించారు.

ఃనవసేవా నౌకాశ్రయం వద్ద 60% దిగుమతి ఇజలకు అవకాశం కల్పించే (ఆఇఆ) లాజిస్టిక్స్ కార్యక్రమం గురించి కూడా మంత్రి తెలుసుకున్నారు . ఇది పోర్ట్‌లో కస్టమ్స్ క్లియర్ చేసిన సరుకును డెలివరీ చేయడానికి తద్వారా రవాణా మరియు ఇతర ఖర్చులు ఆదా చేయడానికి ఇది ప్రత్యామ్నాయ పద్ధతి.

అధికారులు ఆటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ంఇఖీః) నుండి లైసెన్స్ పొందిన ఆపరేటర్లు శిక్షణ పొందారు, ఈ సంవత్సరం ప్రారంభంలో మూడు కొత్త మొబైల్ కంటైనర్ స్కానర్‌లను పోర్టులో ప్రారంభించినట్లు ఆర్థిక మంత్రికి తెలిపారు.. దీనర్థం ఇకపై ఎక్కువ దూరాలకు ట్రైలర్‌లపై కంటైనర్‌లను తరలించాల్సిన అవసరం లేదు. ఇ-లింకింగ్ కాగితం ఆధారిత స్కాన్ నివేదిక చూపితే పని సులభతరం అవుతుంది.

నిర్మలా సీతారామన్ కస్టమ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌ద్వారా దిగుమతి కార్గోలను పనివేళల నిమిత్తం లేకుండా ఉచితంగా ప్రాసెసింగ్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా నిత్య వినియోగానికి తీసుకువచ్చినందుకు మెచ్చుకున్నారు, మిగతా స్థానాల్లోనూ కొనసాగించాలని కోరారు.

పన్ను చెల్లింపుదారులు మరియు పౌరులను, ముఖ్యంగా యువతను నిరంతరం కలవాలని ఆర్థిక మంత్రి అధికారులకు ఉద్బోధించారు. పన్ను చెల్లింపుదారుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాలని మరియు కస్టమ్స్ విధానాలలో మార్పుల గురించి స్థిరమైన అవగాహన కల్పించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. కస్టమ్స్ వ్యాపార ప్రక్రియలను మరింత సులభతరం చేయడానికి సామర్థ్యాన్ని పెంచడంలో సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో సూచనలు చేయాలని ఆమె అధికారులను కోరారు.

.సీతారామన్ 2022 జనవరి 25న అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా కస్టమ్స్ మండలి ద్వారా దేశవ్యాప్తంగా దిగుమతి దారులు, ఎగుమతిదారులు, కస్టమ్ మధ్యవర్తులు పరస్పర చర్చ జరపడానికి ఆదేశించారు. రెండు లక్ష్యాలు ; ఒకటి వ్యాపారం చేయడం సౌలభ్యం కోసం కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చేపడుతున్న వివిధ మార్గాలనుఅమలుపరచే సంస్కరణల గురించి వాటాదారులకు అవగాహన కల్పించడం. ; రెండు వాటాదారుల నుండి ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు, వాటిని పరిష్కరించేందుకు త్వరిత పరిష్కారాలను కనుగొనడానికి ప్రయత్నించమన్నారు.

భారతదేశపు అతిపెద్ద కంటైనర్ పోర్ట్ (ఏఔఖు) కలిగి ఉన్న నవ సేవా , కస్టమ్స్ డ్యూటీ ఆదాయంలో దాదాపు 20%ని దేశానికి అందిస్తుంది. ఇక్కడ సరుకులో 85% పెట్టెలద్వారా (కంటెయినరైజ్) రవాణా చేయబడుతుంది . నౌకాశ్రయం సామర్థ్యం మేరకు సంవత్సరానికి 7 మిలియన్ ఇజఙ లో (ఇరవై అడుగుల సమానమైన పరిమాణం గల కంటైనర్లు) నిర్వహించగలదు.

ఆర్థిక మంత్రితో రెవెన్యూ కార్యదర్శి శ్రీ తరుణ్ బజాజ్, సిబిఐసి ఛైర్మన్ శ్రీ ఎం అజిత్ కుమార్ నవసేవా లో ఒక రోజు పర్యటనలో పాల్గొన్నారు . కస్టమ్స్ చీఫ్ కమిషనర్ శ్రీ ఎమ్ కె సింగ్, న్హవా షెవా, జెఎన్‌పిటి చైర్మన్ శ్రీ సంజయ్ సేథి వీరితోపాటు ఉన్నారు.

రైతులు ఆందోళన విరమించి ఇండ్లకు తిరిగివెళ్లాలి : వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ, నవంబర్ 27: వివాదాస్పద వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన క్రమంలో రైతులు ఆందోళన విరమించి, ఇండ్లకు తిరిగివెళ్లాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ శనివారం అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు. మూడు వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం వెనక్కితీసుకున్నందున ఆందోళన కొనసాగించాల్సిన అవసరం లేదని, రైతులు నిరసనలను వీడి ఇండ్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

రైతుల డిమాండ్లను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. పంటల వైవిధ్యం, జీరో బడ్జెట్ ఫార్మింగ్, మద్దతు ధర యంత్రాంగాన్ని పటిష్ఠం చేయడం వంటి పలు అంశాలపై చర్చించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. రైతు సంఘాల ప్రతినిధులు కూడా ఈ కమిటీల్లో ఉంటారని చెప్పారు.

రైతులు పంట వ్యర్థాలను దగ్ధం చేయడాన్ని నేరపూరిత చర్యగా చూడరాదన్న రైతు సంఘాల డిమాండ్‌ను కూడా ప్రభుత్వం అంగీకరించిందని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటుతో ఎంఎస్‌పీపై రైతుల డిమాండ్ కూడా నెరవేరినట్టేనని మంత్రి తెలిపారు.

రక్తదానం చేసి.. జీవితాన్ని బహుమతిగా ఇవ్వండి : సజ్జనార్

హైదరాబాద్, నవంబర్ 27:రక్తదానం చేసి.. మరొకరికి జీవితాన్ని బహుమతిగా ఇవ్వాలని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. టీఎస్ ఆర్టీసీ సంస్థ ఈనెల 30న బృహత్తర సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణీకులకు రవాణా సేవలందిస్తున్న మరో ముందడుగు వేసి రక్తదాన శిబిర కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టింది.

ఈసందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ? సిబ్బంది నుంచి అధికారుల వరకు, స్నేహితుల నుంచి కుటుంబ సభ్యుల వరకు ఎవరైనా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఇండియన్ ట్రస్టు సహకారంతో టీఎస్ ఆర్టీసీ ఈనెల 30న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తుందన్నారు. అన్ని రీజ

ఉత్సాహాన్ని నింపిన ఆల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్సెక్ట్ కెప్టన్స్ వైస్ కెప్టెన్లు ప్రమాణ స్వీకారం

కరీంనగర్ నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి): ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికలు కీలకంగా వ్యవహరిస్తాయని మరియు ఎన్నికల ద్వారానే సమర్థ పాలన కొనసాగుతుందని మరియు ప్రజలకు కావల్సిన అభివృద్ధి ఫలాలను అత్యధికంగా అందజేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరెందర్ రెడ్డి అన్నారు కరీంనగర్ వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్ వేదుకుగా కరోనా నియమాలను పాటిస్తూ ఏర్పాటు చేసినటువంటి " హౌజ్ కెప్టెన్ల హౌజ్ వైస్ కెప్టెన్లు ప్రమాణస్వీకారత్సోవానికి విశిష్ట అతిథిగా వచ్చి మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్య దేశంలో పెద్దన్న పాత్ర పోశిస్తుందని మరియు ప్రజల మనోభావాలకు ధర్పణం అని చెప్పారు . ఎన్నికల దా్వరానే ప్రజలు వారికి కావల్సిన అవసరాలను తీర్చుకోగల్గుతారని మరియు ఉత్తమమైన వ్యక్తిని ఎన్నుకోడానికి మరియు బలపర్చడానికి ఒక అత్యుత్తమ వేదిక అని చెప్పారు . ప్రజాస్వామ్య దేశంలో ఓట్లు చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు నాయకుల భవితవ్యాన్ని తేల్చి చెప్పేది ఎన్నికే అని చెప్పారు . విద్యార్థులకు ప్రాథమిక దశనుండే ఎన్నికల పట్ల అవగాహన కల్పించడానికై మరియు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికై ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ సంవత్సరం సైతం రెట్టింపు ఉత్సాహంతో పాఠశాలలోని వివిధ విభాగాల కెప్టెన్స్ ' వైస్ కెప్టెన్లు కు ఎన్నికలు , ఎన్నికల వాతావరణం కల్పించే విధంగా నిర్వహించడం కొనసాగినదని చెప్పారు . పాఠశాలలోని " తేజస్ , సరస్ , ధృవ ,లక్ష్య విభాగాలకు బాలబాలికలకు వేరు వేరుగా ఎన్నికల పోటీలను నిర్వహించడం జరిగినదని తెలుపుతూ గెలుపొందిన విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడానికై మరియు శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికై ప్రత్యేకంగా సామాజిక స్పృహను కల్పించడానికై నేడు అట్టహాసంగా ప్రమాణస్వీకరోత్సవాన్ని కరోనా ప్రోటోకాల్సు పాటిస్తూ నిర్వహించడం జరిగినదని చెప్పారు . అనంతరం వారు విద్యార్థులకు బాధ్యతలు మరియు విధుల గురించి స్పష్టంగా తెలియజేశారు . మరియు పాఠశాలలో వ్యవహరించే తీరును విద్యార్థులకు దృశ్య మాళికల ద్వారా అద్భుతంగా తెలిపారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు .

మానవత్వాన్ని చాటుకున్న సర్పంచ్, టిఆర్ఎస్ నాయకులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గత రోజుల క్రితం మరణించిన మాదూరి లక్ష్మీనారాయణ కుటుంబాన్నిశనివారం స్థానిక సర్పంచ్ ఉరడి రాంరెడ్డి, గ్రామ టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించడం జరిగింది , మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు .అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు టీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం , గ్రామ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి తన వ్యక్తిగత 25 కిలోల బియ్యం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నడిగొట్ల హరికృష్ణ ,, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరడి ప్రవీణ్,సింగిల్ విండో డైరెక్టర్ కట్ట ఎల్లయ్య టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఊరడి రాజిరెడ్డి (మెడికల్) ,ఎండీ రహీం ,ఎండీ బాసూ పార్వతి అంజయ్య తదితరులు పాల్గొన్నారు .

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 197 రోజులుగా అన్నదాన కార్యక్రమం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి):మైవేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్యాన్నదానకార్యక్రమం శనివారం నాటికి 197 రోజులకు చేరుకుంది. దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. నేటి అన్నదాన కార్యక్రమం లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు, పార్కింగ్ స్థలంలో, భీమేశ్వరాలయం ముందు ఉన్న యాచకులకు , అన్నర్థులకు మొత్తం 80 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం 197 రోజులుగా నిరంతరాయంగా నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిత్యాన్నదానం చేస్తున్న క్రమంలో శనివారం అన్నదాతలుగా నగుబోతు రవీందర్, రొక్కం నర్సింహా రెడ్డి, ఉప్పుల అనిల్, వెలిచాల గోవర్ధన్ మరియూ వారి కుటుంబసభ్యులు అందించిన విరాళాలతో శనివారం అన్నదానం నిర్వహించడం జరిగింది.దాతలు చేస్తున్న సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమం లక్ష్యంతో ముందుకు సాగడం జరుగుతుందని, అన్నదానం మహాదానం అని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, జూలపెల్లి రాజు, భస్మాంగి బసవరాజు, చల్లా సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షరాల తోవ 45 వార్షికోత్సవం సందర్భంగా....

అక్షరాల తోవ పురస్కారం-2022

మూడు ఉత్తమ కథలకు సమాన బహుమతులు :
ఒక్కో కథకు 2000/- నగదు మరియు అక్షరాల తోవ పురస్కారం

ప్రతి సం॥ము జరిగే ఈ కథల పోటీల్లో....

నిబంధనలు :

- నవ్యత, సృజనాత్మక కలిగిన కథలు మాత్రమే ఈ పోటీకి తీసుకోబడును.
- సామాజిక అంశమేదైనా వస్తువుగా స్వీకరించవచ్చు.
- కథలను డి.టి.పి. చేసి పంపించాలి. (ఎ4 సైజులో 5 పేజీలు దాటరాదు) (చేతి రాత కథలు తిరస్కరించబడును.)
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం అయిన కథలు కాకుండా ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసినదై ఉండాలి.
- ఒక రచయిత ఒక్క కథ మాత్రమే పంపించాలి.
- రచన దేనికి అనుకరణ, అనుసరణ కాదని హామీపత్రం జత చేయాలి. రచయిత వివరాలు హామీపత్రంలోనే పేర్కొనాలి.
- ఈ పోటీకి సంబంధించి న్యాయ నిర్ణేతదే తుది నిర్ణయం. ఎటువంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- మీ కథలను 20 డిసెంబర్ 2021వ తేదీ లోపు క్రింద తెలిపిన చిరునామాకు పోస్ట్ / కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలి.

మనసును తాకాలి
మధురానుభూతిని కలిగించాలి
నాలుగు కాలాల పాటు
పాఠకుల హృదయాల్లో నిలిచే
సరికొత్త కథలకు మాత్రమే ప్రాధాన్యత.

సదా సాహిత్య సేవలో...
అక్షరాల తోవ ఖమ్మం
రి.నెం. 339/2018

నామా పురుషోత్తం - 9866645218
దాసరోజు శ్రీనివాస్ - 9010972169
రాచమళ్ళ ఉపేందర్ - 9849277968

మీ కథలను పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతిలాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001.
సెల్ : 9849277968

మహారాష్ట్ర ఫుల్ కండిషన్స్.. రెండు డోసుల వ్యాక్సిన్, ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ మస్ట్..

న్యూఢిల్లీ, నవంబర్ 27:కరోనా కొత్త వేరియంట్ నేపథ్యంలో మహారష్ట్ర ప్రభుత్వం పలు ఆంక్షలు పెట్టింది. రాష్ట్రంలోకి వచ్చే ప్రయాణికులు ఎవరైనా సరే రెండు డోసుల వ్యాక్సిన్ వేసుకుని ఉండాలని కండిషన్ పెట్టింది ప్రభుత్వం. అంతేకాకుండా 72 గంటల ముందు ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ మస్ట్ గా ఉండాలని తెలిపింది. కాగా, దక్షిణాఫ్రికాతో పాటు పలు దేశాల్లో కలకలం సృష్టిస్తున్న కొవిడ్ కొత్త వేరియంట్‌పై తెలంగాణ ప్రభుత్వం కూడా అప్రమత్తం అయ్యింది.

ఈ నేపథ్యంలో ఈ నెల 28న వైద్యారోగ్య శాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు భేటీ కానున్నారు. కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. కొత్త వేరియంట్ వ్యాపిస్తున్న దేశాల నుంచి వచ్చే వారి విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. ఇదే అంశంపై ఇటీవల కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ప్రయాణికుల ట్రేసింగ్, టెస్టింగ్‌పై మంత్రి హరీశ్‌రావు వైద్యారోగ్య శాఖ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేయనున్నారు.

బాలికపై హెడ్మాస్టర్ లైంగిక వేధింపులు!

జైపూర్, నవంబర్ 27:: విద్యాబుద్ధులు నేర్పి చిన్నారులను సరైన దారిలో పెట్టాల్సిన ప్రధానోపాధ్యాయుడే వక్రబుద్ధితో పక్కదారి పట్టాడు. ఆరో తరగతి చదివే బాలిక(11)పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జైపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నవంబర్ 20న ఈ ఘటన జరిగింది.

బాలికపై కన్నేసిన హెడ్మాస్టర్ తరగతి గదిని శుభ్రం చేయాలని కోరాడు. బాలిక చీపురుతో గదిని శుభ్రం చేస్తుండగా ఆమెను అభ్యంతరకరంగా తాకాడు. బాలిక భయంతో ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లికి తెలిపింది. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో సహా పలు సెక్షన్ల కింద కీచక టీచర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

దేశాలకు సప్లయ్ చేసే వ్యూహం ఉండాలి: మాజీ ఎంపీ సిరిసిల్ల

హైదరాబాద్, నవంబర్ 27: రాష్ట్రంలో పండిన అదనపు ధాన్యాన్ని నిల్వ చేసి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు సప్లయ్ చేసే వ్యూహం ఉండాలని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ నగరంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న వరి దీక్షలో ఆయన మాట్లాడారు. పట్లు కొనకుండా కేంద్ర, రాష్ట్ర సర్కార్లు దొంగ డ్రామాలాడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాలకు వ్యవసాయ ప్రణాళికలు లేవన్నారు. ప్రజలను, రైతులను మోసం చేస్తూ మోదీ, కేసీఆర్ పాలన చేస్తున్నారని ఆరోపించారు. రైతులను చైతన్య పరిచే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

డిసెంబర్ 17న చలో విజయవాడ

న్యూఢిల్లీ, నవంబర్ 27: డిసెంబర్ 17న చలో విజయవాడ నిర్వహిస్తామని ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సంఘం కార్యదర్శి బిశ్వంభర బసు తెలిపారు. రేషన్ పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఇంటింటికీ రేషన్ విధానం తెచ్చారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వమే మూడో పార్టీని తీసుకువచ్చిందని చెప్పారు. మొబైల్ డిస్పెన్సరీ విధానంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. గన్ని బ్యాగుల విక్రయంపై తెచ్చిన జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగు : మంత్రి గంగుల

కరీంనగర్ నవంబర్ 27 : యాసంగి వరిపై మొండి వైఖరి అవలంబిస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ విధానాలతో ప్రత్యామ్నాయ పంటలవైపు సగటు రైతు దృష్టిసారించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

ఈ అంశంపై రైతులకు మార్గదర్శకంగా ఉండేందుకు వారికి భరోసా కల్పించే విధంగా మంత్రి గంగుల కమలాకర్ చర్యలు తీసుకుంటున్నారు. కరీంనగర్ సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఇంతకాలం వరి పండించిన పొలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఆయిల్ ఫామ్ సాగు పనులకు మంత్రి గంగుల స్వయంగా శనివారం శ్రీకారం చుట్టారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు ఆయిల్ ఫామ్ సాగుకు అనువుగా భూమిని సేద్యం చేసారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ సాగుకు తెలంగాణ నేలలు అనువైనవని నిర్ధారణ అయిందని తెలిపారు.

కరీంనగర్ జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు పెంచేందుకు లోహియా కంపెనీని ప్రభుత్వం నియమించిందని, రైతులకు సబ్సిడీపై మొక్కలు అందించడం మొదలు కోత అనంతరం గెలలు తీసుకునే వరకూ ఆ కంపెనీ అండగా ఉండి బాధ్యతలు నిర్వహిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. కోతుల బెడద లేకుండా, చీడపీడల బెడద తక్కువతో సాగయ్యే ఆయిల్ ఫామ్ చెట్లను తొమ్మిది మీటర్లకు ఒక మొక్క చొప్పున ఎకరాకు దాదాపు 57 మొక్కలను నాటొచ్చని పేర్కొన్నారు.

దీంతో 10టన్నుల దిగుబడి వస్తుందని, టన్నుకు 10వేల ధర వచ్చే అవకాశం ఉందన్నారు. అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు రూ.70 నుండి రూ. 80వేల ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మా అధ్యక్షుడి కీలక ప్రకటన..

హైదరాబాద్, నవంబర్ 27:హైదరాబాద్ లోని ప్రముఖ హాస్పటల్స్ తో ఒప్పందం కుదుర్చుకున్నామని మా అధ్యక్షుడు మంచు విష్ణు తెలిపారు. మా సభ్యుల సంక్షేమమే మాకు పరమావధి అన్నారు. ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తమన్నారు. అంతేకాకుండా బిల్లుల్లో రాయితీలు లభిస్తాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ ప్రతి ఒక్క 'మా' సభ్యుడి పేరిట ప్రత్యేక ఫైల్ ఏర్పాటు చేస్తారని, ఆ ఫైల్ లో సదరు సభ్యుడి ఆరోగ్య వివరాలు అన్నీ ఉంటాయని మంచు విష్ణు తెలిపారు. మహిళా సభ్యులు రొమ్ము క్యాన్సర్లు, గర్భాశయ క్యాన్సర్ల చికిత్సలు కూడా పొందవచ్చని అన్నారు.

ఈ నేపథ్యంలో తాను డాక్టర్ నాగేశ్వర రెడ్డి (ఏఐజీ), డాక్టర్ భాస్కర్ రావు (కిమ్స్), శ్రీమతి సంగీత (అపోలో), డాక్టర్ సుబ్రమణియమ్ (అపోలో సీఈఓ), డాక్టర్ గురవారెడ్డి (సన్ షైన్ హాస్పిటల్స్), డాక్టర్ అనిల్ కృష్ణ (మెడికవర్) లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని విష్ణు వెల్లడించారు. ఇక, టెనెట్ డయాగ్నస్టిక్స్ లో 50 శాతం రాయితీతో వైద్య పరీక్షల సదుపాయం అందుబాటులోకి వచ్చిందని వివరించారు.

రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక చెక్ పోస్ట్‌లు...

హైదరాబాద్, నవంబర్ 27:ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుపై ప్రతిపక్షాల విమర్శలు, ఆందోళనలతో అల్లకల్లోలంగా ఉంది. కాగా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్రానికి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తోన్న లారీలు, ట్రాక్టర్లను వెనక్కి పంపుతున్నారు తెలంగాణ అధికారులు. ఈ మేరకు రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు పోలీసులు. తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని అందుకే వారిని వెనక్కి పంపుతున్నామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మూడు చోట్ల ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.కేటీ దొడ్డి మండలం నందిన్నె, గట్టు మండలం బల్గెర, ఉండవల్లి మండలం పుల్లూరు వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో కూడిన బృందం ధాన్యం రాకను పర్యవేక్షిస్తోంది. పుల్లూరు చెక్‌పోస్టు వద్దకు ఏపీ నుంచి ధాన్యం లోడుతో వచ్చిన లారీలను వెనక్కి పంపారు అధికారులు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, తెలంగాణలో కనీస మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు అధికారులు.

ఆ మెడికల్ కాలేజీలో 281కి పెరిగిన కరోనా కేసులు

బెంగళూరు, నవంబర్ 27:: కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లోని ఎస్‌డీఎం మెడికల్ కాలేజీ కొవిడ్ హాట్‌స్పాట్‌గా మారింది. ఆ కాలేజీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య అంతకంతకే పెరుగుతున్నది. ఇవాళ కూడా కొత్తగా 77 మంది విద్యార్థులు, సిబ్బందికి కరోనా పాజిటివ్ రావడంతో మొత్తం కేసుల సంఖ్య 281కి పెరిగింది. దాంతో ఆ మెడికల్ కాలేజీ ఉత్తర కర్ణాటకలో మెడికల్ హబ్‌గా మారింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో కొత్త పేషెంట్లను ఎవ్వరినీ చేర్చుకోవడంలేదు. దానిలోకి ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను పూర్తిగా మూసేశారు. కరోనా నెగెటివ్ వచ్చిన వారిని డిశ్చార్జ్ చేస్తున్నారు.కాగా, ఎస్‌డీఎం మెడికల్ కాలేజీలో కరోనా బారినపడ్డ విద్యార్థులు, సిబ్బంది రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నవారేనని, ఇటీవల జరిగిన ఫ్రెషర్స్ పార్టీయే కరోనా విస్తృతికి కారణమని అధికారులు చెప్పారు.

తెలంగాణలో కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ.. పరిశీలనకు ప్రత్యేక కమిటీ: మంత్రి ప్రశాంత్‌రెడ్డి..

హైదరాబాద్, నవంబర్ 27:నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఔంంఅ) 42వ ఎక్స్యూటివ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా న్యాక్ వైస్ చైర్మన్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, న్యాక్ అధికారులు హాజరయ్యారు. అయితే ఈ భేటీలో ప్రధానంగా స్టూడెంట్స్ నుంచి కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న దానిపై పలు విజ్ఞాపణలు అందాయి. దీని ఏర్పాటుకు గాను ముగ్గురితో కూడిన కమిటీ వేసినట్టు మంత్రి తెఇపారు. ఈ సందర్భంగా న్యాక్ లో పలు బ్లాక్ లను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కల్పిస్తున్న సౌకర్యాలు, ఉద్యోగ నియామకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

"ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు న్యాక్ అనే సంస్థతో స్కిల్ డేవల్మెంట్ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. కొవిడ్ సమయంలో మా న్యాక్ బాగా పని చేసింది. 95 శాతం అచివ్ అయ్యింది. ఈ సందర్భంగా మా సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నా. పోయిన సంవత్సరం 19 వేల మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. ఈ ఏడాది 20 వేల మందికి శిక్షణ ఇవ్వాలని అనుకుంటున్నాం. నాన్ స్కిల్ వారికి ఒక రకమైన స్కిల్స్, స్కిల్స్ ఉన్న వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఇస్తే భవన నిర్మాణ రంగంలో ఉండేలా ప్రోత్సహిస్తున్నాం. న్యాక్ ఆధ్వర్యంలో బీటెక్ చేసిన వారి కోసం ఒక్క సంవత్సరం పీజీ విద్యను అందించాలని నిర్ణయం తీసుకున్నాం." అన్నారు మంత్రి ప్రశాంత్‌రెడ్డి.

"న్యాక్ లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు స్లాబ్ పెంచేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులకు పీఆర్సీ అంశానికి సంబంధించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తాను. ఈ సమావేశంలో కన్స్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అందరు కోరారు. ముఖ్యమంత్రి కూడా న్యాక్ లో కొత్తగా ఏర్పాటు చేసి యువతకు స్కిల్స్ పై శిక్షణ ఇవ్వాలని అంటుంటారు. ఈ యూనివర్సిటీ కి సంబంధించి 3 సభ్యులతో కమిటీ వేశాం. కమిటీ రిపోర్ట్ వచ్చాక యూనివర్సిటీ ఏర్పాటు పై నిర్ణయం ఉంటుంది." అన్నారు మంత్రి.

డిసెంబర్ నెలాఖరుకల్లా మినీ స్టేడియం పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి): డిసెంబర్ నెలాఖరుకల్లా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న మినీ స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ మున్సిపల్ అధికారులతో కలిసి మినీ స్టేడియం నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేడియంలో రన్నింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్టు, వాలీబాల్ కోర్టు, ఎంట్రీ ఆర్చ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. డిసెంబర్ చివరి కల్లా పూర్తిస్థాయిలో స్టేడియం నిర్మించి, ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు.

ప్రతి నెలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసే రేడియో ప్రసంగం .. మన్ కీ బాత్ కోసం ప్రత్యక్ష ప్రసార భాగస్వామిగా మారిన హంగామా

హైదరాబాద్, నవంబర్ 27:ః భారతదేశంలో సుప్రసిద్ధ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీలలో ఒకటైన హంగామా, ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క నెలవారీ రేడియో ప్రసంగం, మన్ కీ బాత్ కోసం ప్రత్యక్ష ప్రసార భాగస్వామిగా మారింది

. ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యలను చర్చించే అవకాశం మాత్రమే కాదు వాటికి తగిన పరిష్కారాలను సైతం పొందాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ , రాజకీయాలకు అవల, భాగస్వామ్యం, శక్తికి ప్రతీకగా ఉంటుంది. హంగామా తమ ఛానెల్స్ హంగామా ప్లే మరియు హంగామా మ్యూజిక్ ద్వారా 28 నవంబర్ 2021 ఉదయం 11 గంటల నుంచి ఈ షోను నూతన శ్రోతల దగ్గరకు తీసుకువెళ్లనుంది.

జన్‌శక్తి పై దృష్టి కేంద్రీకరించిన, మన్ కీ బాత్ ప్రోగ్రామ్‌ను భారతీయుల కోసం తీర్చిదిద్దారు. ఈ షో ద్వారా పలు ప్రజా ఉద్యమాలైనటువంటి స్వచ్ఛత, ఫిట్‌నెస్‌కు ప్రాచుర్యం కల్పించడం, మత్తుపదార్థాల మహమ్మారిపై పోరాటం, బాలికా రక్షణ, దివ్యాంగుల సంక్షేమం వంటి వాటిని ప్రోత్సహించింది. హంగామా ప్లే మరియు హంగామా మ్యూజిక్ ద్వారా మన్ కీ బాత్ ప్రసారం చేయడంతో మరింత విస్తృతంగా ఈ కార్యక్రమం ప్రజలకు చేరువవుతుంది.

ఈ భాగస్వామ్యం గురించి హంగామా డిజిటల్ మీడియా ఫౌండర్ అండ్ సీఈవో నీరజ్ రాయ్ మాట్లాడుతూ "గౌరవ ప్రధాన మనసులో మాటను తెలుపుతున్న మన్ కీ బాత్ కార్యక్రమంతో భాగస్వామ్యం చేసుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నాము. ఈ కార్యక్రమానికి ప్రజలలో చక్కటి ఆదరణ ఉంది. మన ప్రధాని మన దేశపు సానుకూలతలు, విజయాలు, భవిష్యత్ లక్ష్యాలు వంటి వాటిని మాత్రమే కాదు, మనకు ఆందోళన కలిగించే అంశాలు, వాటి పరిష్కారాలు గురించి కూడా ప్రస్తావిస్తుంటారు. తాము అభిమానించే దేశం ఏ విధంగా పురోగతి సాధిస్తుందో తెలుసుకోవడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపుతున్నారు. మా వేదికల ద్వారా మన్‌కీ బాత్ ను నూతన ప్రేక్షకుల దగ్గరకు తీసుకుపోనున్నాం. ఇప్పుడు కేవలం ఓ బటన్ నొక్కడంతో ప్రజలు ఎక్కడి నుంచైనా ఈ కార్యక్రమం వినగలరు"అని అన్నారు.

వేములవాడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామం నిర్మాణంలో వేగం పెంచాలి

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో పాత మార్కెట్ యార్డు ప్రదేశంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ ఉ నాన్ వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 2 ఎకరాల స్థలంలో 4 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మార్కెట్ యార్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పాత భవనం కూల్చివేత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ఆయన వైకుంఠధామం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా నిర్మాణం పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు వ్యక్తిగత శ్రద్ధ వహించి, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని అన్నారు. పనుల పూర్తిలో అలసత్వం సహించేది లేదని, చర్యలుంటాయని అధికారులను హెచ్చరించారు. తదనంతరం వేములవాడ పట్టణంలోని చామకుంట వద్ద 2 కోట్ల 70 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న వెజ్ మార్కెట్ నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ సందర్భనల్లో కలెక్టర్ వెంట సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, డీఈఈ సుచరన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.